అరకొర బస్సులతో అవస్థలు

- రోజుకు ఒకే ట్రిప్పు నడుపుతున్న అధికారులు
- ఇబ్బందుల్లో రుద్రారం గ్రామ విద్యార్థులు, ప్రయాణికులు
- బస్సు ట్రిప్పులు పెంచాలని వినతి


ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి పాఠశాల సమయంలో ఒక్క ట్రిప్పు మాత్రమే బస్సు నడుస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దాదాపు 30 ఏళ్లుగా రుద్రారం పరిసర గ్రామాలకు 8 ట్రిప్పుల బస్సులు తిరుగుతుండేవని, ప్రస్తుతం ఒక్క ట్రిప్పు మాత్రమే తిరుగుతుండటంతో విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. అంగడిరాయిచూర్, అన్నారం, టేకుల్‌కోడ్ గ్రామాల మీదుగా రుద్రారం గ్రామానికి చేరుకొని తిరిగి అదే గ్రామాల మీదుగా కొడంగల్ చేరుకొంటుంది. ఆయా గ్రామాలకు చెందిన 120 మందికి పైగా విద్యార్థులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదని చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఒక్క ట్రిప్పు బస్సు నడిపిస్తుండటంతో అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నామని ప్రజలు అంటున్నారు.

గతంలో 8 ట్రిప్పులు..

గతంలో రుద్రారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ 8 ట్రిప్పులు ఉండేది. ఉదయం 8 గంటలకు, 10 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, 3 గంటలకు, 5 గంటలకు, రాత్రి 7 గంటలకు, 9 గంటలకు ఇలా మొత్తం 8 ట్రిప్పులు తిరుగుతుండేవి. దీంతో రుద్రారంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యవంతంగా ఉండేది. గతంలో తాండూర్, పరిగి డిపోల పరిధిలో బస్సులు నడిచేవని, ప్రస్తుతం పరిగి డిపో మాత్రమే ఒక్క ట్రిప్పు బస్సు నడిపిస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇటీవల నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో డిపో ఏర్పాటైన సందర్భంగా రుద్రారం గ్రామానికి చెందిన ప్రజలు గ్రామానికి బస్సును నడిపించాలని వినతిపత్రం సైతం అందించారు. బస్సు వెళ్లిపోయాక ప్రైవేటు వాహనాలలో కిక్కిరిసిన ప్రయాణం తప్పదని, ప్రైవేటు వాహనాలు నిండినాకే కదులుతాయని, పేర్కొంటున్నారు. అధికారు లు ఇప్పటికైనా స్పందించి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని గతంలో మాదిరి బస్సు ట్రిప్పులను పెంచుతూ వారి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి



పాఠశాల సమయంలో బస్సు నడుస్తున్నా, ఒక్కో పర్యాయం బస్సు ముందుగా వెళ్లినా విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఒక్క ట్రిప్పు బస్సుతో విద్యార్థులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి బస్సు ట్రిప్పులను పెంచేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్యగౌడ్, రుద్రారం

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

- తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

దోమ: గ్రామంలో శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన ఓ రైతు శిఖం భూమి కబ్జాకు పాల్పడ్డాడు. ఈ విషయమై శుక్రవారం గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ షాహెదా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దిర్సంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 47/2లో 36 ఎకరాల 19 గుంటల శిఖం భూమి ఉంది. అయితే ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన భగవంత్‌రెడ్డి అనే రైతు 6 ఎకరాల 20 గుంటల భూమిని ఆక్రమించుకొని పంటలను పండించుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయంపై గతంలో పలుమార్లు గ్రామస్తులు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. ఆక్రమణకు గురైన భూమిని కాపాడి అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు సత్యయ్య, నాయకులు మహిపాల్ రెడ్డి, గ్రామస్తులు రమేశ్, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక


సాయిరాంరెడ్డికి పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: మండల బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సాయిరాంరెడ్డి పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో చేరిన సాయిరాంరెడ్డి, మండల పరిధిలోని కాస్లబాదు గ్రామ యువ బీజేపీ నాయకుడు నరేశ్ తదితరులకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి చంద్రగిరిలో జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్ (చంద్రగిరి)లో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వరస్వామి దేవాలయం వార్షిక మహోత్సవాన్ని శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వెంకటచార్ శుక్రవార్, రాఘవచార్ శుక్రవార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో శనివారం నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు జాతర ఉత్సవాలు ఉంటాయన్నారు. 5వ తేదీ ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనసేవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానించిన భరత్‌కుమార్, స్థానిక నేతలు

కుల్కచర్ల: జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా కుల్కచర్ల తహసీల్దార్ రమేశ్‌కుమార్ ఎంపికవ్వడం సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ బ్లాక్‌టు మండల అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కుల్కచర్ల తహసీల్దార్‌ను ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేశారు. ఈ మేరకు శనివారం ఆయనను తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజి, వెంకటయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు


సత్ర నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

యాలాల: మండలంలోని ముద్దాయిపేటలో ఉన్న శివాలయంలో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్త, ఎంపీటీసీ దేవగారి రాములు అన్నారు. శుక్రవారం ఆలయ సమీపంలో సత్రం నిర్మించేందుకు గాను స్థానిక సర్పంచ్ క్రిష్ణయ్యగౌడ్‌తో కలిసి పనులను ప్రారంభించారు. ప్రతీ ఏడాది శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం, సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ సమీపంలో సత్రం లేకపోవడంతో శివమాలలు వేసే భక్తులకు ఇబ్బంది కలుగుతున్నట్లు గుర్తించామన్నారు. సత్ర నిర్మాణం కోసం చేపట్టిన కార్యక్రమం వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మల్లయ్య స్వామి, పంతుల రాజప్ప, గొల్లగోపాల్, సురేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

యాలాల: సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పగిడ్యాల గ్రామానికి చెందిన భాగ్యమ్మకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతోమంది పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అనారోగ్యానికి గురై చికిత్స పొందే వారికి వైద్య ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేశ్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ బాబా, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, నాయకులు మంత్రి వెంకటయ్య, క్రిష్ణకుమార్ తదితరులున్నారు.

బీటీఎస్ కాలనీలో కంటి వెలుగు ప్రారంభం

అనంతగిరి: వార్డులో చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 33వ వార్డు కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని బీటీఎస్ కాలనీలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బాగాయిపల్లిలో సంత ప్రారంభం


బాగాయిపల్లి గ్రామంలో సంతను ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

యాలాల: మండల పరిధిలోని బాగాయిపల్లిలో కొత్తగా ప్రారంభించిన సంతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పగిడియాల సర్పంచ్ బసిరెడ్డి, ఎంపీటీసీ రాములు సూచించారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సంతను స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక రైతులకు ఉపయోగకరంగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామస్తుల సమక్షంలో సంత నిర్వహణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతీ శుక్రవారం గ్రామంలో సంతను నిర్వహించేందుకు తీర్మానించినట్లు తెలిపా రు. ఈ అవకాశాన్ని సమీప రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వా రు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింహులు గౌడ్, సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, గ్రామస్తు లు పగిడ్యాల మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మోహనరెడ్డి, బాబయ్య, సలీం పాషా, నజీరొద్దీన్ పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం


కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

యాలాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పోటీ ఉద్యోగాల దరఖాస్తుల కోసం ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పగిడ్యాల సర్పంచ్ బసిరెడ్డి సూచించారు. శుక్రవారం బాగాయిపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీఎస్‌సీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్‌సీ నిర్వాహకుడు మల్లేశం మాట్లాడుతూ.. పీఎం కిసాన్ రైతులకు అవసరమైన ఈకేవైసీ, ఈశ్రమ్ కార్డుల దరఖాస్తులు, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డుల దరఖాస్తులు, డిజిటల్ పేమెంట్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.నేతలు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబూరావు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి


దేవాలయంలో బోరును వేయిస్తున్న ఎంపీటీసీ రాములు

ఎంపీటీసీ రాములు

దోమ: దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీటీసీ రాములు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న హనుమాన్ దేవాలయం నిర్మాణంలో భాగంగా ఎంపీటీసీ నిధులతో నూతన బోరును వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకొని బోరును వేయించామన్నారు. దేవాలయంలో ఎలాంటి అభివృద్ధికి అయినా తనవంతు సహాయ సహకారాలను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. గ్రామ సర్పంచ్ పద్మ, ఉపసర్పంచ్ బిచ్చిరెడ్డి, గ్రామస్తులు కుందేల సత్యయ్య, అంజి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కుల్కచర్ల: మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో గల శ్రీకోదండ సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 29 వరకు కొనసాగనున్నాయని ఆలయ ధర్మకర్త విశ్వకర్మ రమేశాచార్యులు తెలిపారు. శుక్రవారం గణపతిపూజ, నవగ్రహ పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు. 28వ తేదీ శనివారం శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం, సాయంత్రం కుంకుమార్చన, పల్లకీసేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 29వ తేదీ తెల్లవారుజామున రథోత్సవం, సాయంత్రం శకటోత్సవం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కావున భక్తులు పెద్దఎత్తున హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొడంగల్ రూరల్ : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలని వినతిలో పేర్కొన్నారు.

సబ్బండ వర్గాలకు బీఆర్‌ఎస్ అండ

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: సబ్బండ వర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండల కేంద్రం అనుబంధ గ్రామమైన బురెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం బుడగ జంగాల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల ఉన్నతికి వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతీ కుటుంబానికి అందేలా ఎంతో కృషి చేస్తుందని అన్నారు. బుడగ జంగాల ప్రజలు స్వశక్తితో ఎదుగుతున్న తీరు ఎంతోమందికి ఆదర్శనీయమని అభినందించారు. బుడగ జంగాల ప్రజల అభ్యున్నతికి తమవంతుగా సహాయసౌకర్యాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్‌ఎస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్, పాల నర్సింహులు, శివకుమార్, స్థానిక బుడగ జంగాల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కులకచర్ల మండలం చాపలగూడెం గ్రామానికి చెందిన హోంగార్డు శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోంగార్డు శ్రీనివాస్ మృతి బాధాకరమని, అతని మృతి తీవ్ర విచారాన్ని కలిగించిందని అన్నారు. ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయ సౌకర్యాలు త్వరితగతిన అందేలా చూడటంతో పాటుగా కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్‌ను సద్వినియోగం చేసుకోండి

కుల్కచర్ల: ప్రభుత్వం అందిస్తున్న కేసీఆర్ కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి రజిత, సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్‌లు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 25 మంది లబ్ధిదారులకు కేసీఆర్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేద గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో కేసీఆర్ కిట్ పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయలక్ష్మి, రత్నమ్మ, ప్రశాంత్, శ్రీనివాస్ స్వరూప, యాదమ్మ, నర్సమ్మ, సత్యమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల: బాలికల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మండల కోఆర్డినేటర్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ సమానత్వం, మహిళా సాధికారత, సామాజిక ఆర్థిక అభివృద్ధి అనే అంశాలలో బాలికలు, మహిళలు ముందుకు సాగేందుకు ప్రతిఒక్కరూ అందుకు అవసరమైన సహాయ సౌకర్యాలను కల్పించాలని పేర్కొన్నారు. బాలిక విద్యకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని, చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య, బాలికల జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు 26వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మంకాల్ రాఘవేందర్ సూచించారు. శుక్రవారం స్థానిక మాథుర్ గ్యాస్ సౌజన్యంతో, అగ్ని మాపక సిబ్బంది వార్డు ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇంట్లో వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్‌ను మంటలు చుట్టు ముట్టితే సులభంగా ఆర్పేసే విధానాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం రాఘవేందర్ మాట్లాడుతూ నిత్యం ఇళ్లల్లో వంట చేస్తున్న సమయంలో గృహిణులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వంట పూర్తయిన తర్వాత తప్పకుండా గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. పొరపాటున ఇంట్లో గ్యాస్ లీకైనట్లు వాసన వస్తే వెంటనే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసి, కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలన్నారు. ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ నాగార్జున మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలంలో ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. నిప్పును ఆర్పకుండా బయట వేయడం, గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయకపోవడం వంటి పనులకు స్వస్తి చెప్పాలన్నారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ దినోత్సవం


ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా జెండా ఎగురవేస్తున్న ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు

తాండూరు టౌన్: తాండూరు ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎలక్ట్రీషియన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు నసీర్ కార్యాలయం ఎదుట జెండా ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బల్బును కనుగొని చీకట్లో ఉన్న ప్రపంచాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన మహనీయుడు థామస్ ఆల్వా ఎడిసన్‌కు గౌరవ సూచకంగా ఎలక్ట్రీషియన్స్ డేను నిర్వహిస్తున్నామన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎలక్ట్రీషియన్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎలక్ట్రీషియన్లు అందరికీ ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు నందు, నగేష్, వాహీద్, బషీర్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్

పెద్దేముల్: పాఠశాల అభివృద్ధికి తనవంతుగా రూ.2 లక్షల విరాళం ఇస్తానని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ ప్రకటించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి, రిటైర్డ్ హెచ్‌ఎం కోహీర్ మల్లయ్య జ్ఞాపకార్థం స్కూల్ డెవలప్‌మెంట్ కోసం రూ.2 లక్షలు అందిస్తానని తెలిపారు. ఈ నిధులతో తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వసతులు కల్పిస్తామని చెప్పారు. అనంతరం హెచ్‌ఎం నర్సింహులు, ఎస్‌ఎంసీ చైర్మన్ సాకలి రాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం నర్సింలు, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

యువతే పార్టీకి పట్టుకొమ్మలు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

యాలాల: పార్టీకి యువతే పట్టుకొమ్మలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవనూరు గ్రామంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలపేతానికి యువత ఎంతో కీలకమన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మండలానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రతీ గ్రామానికి రూ.50 లక్షల నిధులు కేటాయించడంతో ఏళ్లుగా అపరిష్కారంగా ఉన్న సమస్యలు దూరం అయ్యేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేశ్, నాయకులు మంత్రి వెంకటయ్య, క్రిష్ణకుమార్, రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు.